నేను మొదటిసారి జానకిని చూసింది మా పెత్తల్లి కొడుకు పెళ్ళిలో. మనిషి సన్నగా, నాజూకుగా, ఆకర్షవంతంగా కనబడింది.

అప్పటికింకా జానక్కి పెళ్ళికాలేదు.

"చక్కని పిల్ల. ఎంత అదృష్టవంతుడికి రాసిపెట్టి ఉందో!" అన్నది మా అమ్మ ఎరితోనో.

"ఇంకేం! నీకొడుక్కి చేసుకో." అన్నది ఆ రెండో ఆవిడ.

"ఇంకా నయం!" అన్నది మా అమ్మ.

జానకి నా యీడుదేనని నేను అర్థంచేసుకున్నాను.

మా పెత్తల్లి అల్లుడికి జానకి ఏమవుతుందో నాకు సరిగా తెలీలేదు. అంత పెద్ద దగిర చుట్టం కాదనుకుంటాను

ఆ పెళ్ళిలో మందనంతకే కలిపి ఒక గ్రూపు ఫొటో తీశారు. ఆ ఫొటో కాపీ మా పెత్తల్లి గారింట్లో చూశాను. ఫొటోలో జానకి అందరిలాగే ఉంది ప్రత్యేకత ఏమీ లేదు. ఆ ఫొటోలో మా బంధువులే నాకు అపరిచితుల్లాగే కనబడ్డారు; పెళ్ళికొడుకు వైపు వాళ్ళమాట చెప్పేదేమిటి!

ఎవరో ఆవిడ జానకిని నాకు చేసుకోమనటం జ్ఞాపకం వస్తే తలలో కాస్త కితకిత కలిగేది. అదికూడా సమసిపోయింది.

ఆ తరవాత పూర్తిగా పదేళ్ళకు నేను మద్రాసులో ఒక సినిమా థియేటరు దగ్గిర జానకిని మళ్ళీ చూశాను. మళ్ళీ చూడటం అన్నమాటకు నిజంగా అర్థం లేదు. ఎందుకంటే ఇది అసలు చూడటం.

జానకిని చూడగానే మాడు మీద ఎవరో బలంగా కొట్టినట్టు తల తిరిగిపోయింది. ఆమెలో అంత ఆకర్షణ ఉన్నది. ముఖ్యంగా ముఖంలో. కాకపోతే చూపులో. ఆ ఆకర్షణ ఎక్కడ ఉన్నదీ నాకే స్పష్టంగా తెలీదు.

నూటికి తొంభై తొమ్మిది ముఖాలలో నాకు జైలుగోడలు కనిపిస్తాయి. ముఖంలో నుంచి ఆత్మ తొంగిచూస్తుందంటారు. అది అక్షరాలా నిజం. పసిపిల్లల ఆత్మలు నిర్మలంగా ఉంటాయి గనక వాళ్ళ ముఖాలు అందంగా ఉంటాయి. పూర్వం చైనావాళ్ళు ఆడవాళ్ళ పాదాలను బంధించినట్టు కొందరు రాక్షసులు రెండేళ్ళయినా నిండని తమపిల్లల ఆత్మలను బంధించేస్తారు. అలాంటి పిల్లల ముఖాలు చూసినప్పుడల్లా వాళ్ళతల్లిదండ్రులను కుంభీపాక నరకానికి పంపితే ఎంతబాగుండును అనిపిస్తుంది. పిల్లలముఖాలు వికసించిన పువ్వులా ఉండాలి అమాయకులైన పెద్దవాళ్ళ ముఖాలూ అలాగే ఉండాలి.



జానకిముఖం. సినిమాహాలు దగ్గిర చూసినప్పుడు, వికసించిన డాలియా లాగుంది.

డబ్బుంటే ముఖాలు నిజంగా వికసిస్తాయనుకోను. డబ్బుతాలూకు కాలుష్యంకూడా ముఖాలలో కనిపిస్తుంది. దారిద్ర్య బాధవల్ల ముఖాలు ముడుచుకుపోవచ్చు. కాని, ఏకాస్త ఆనందం లభించినా పేదవాళ్ళ ముఖాలుకూడా విచ్చుకున్న పూవులే నే ఉంటాయి. అమాయకులైనే కార్లలో తిరిగే ముఖాల్లో నిజమైన ఆనందం చూసినట్టు నాకెక్కడా కనిపించలేదు.






డబ్బు సుఖాలివ్వగలదేమోగాని ఆనందం ఇవ్వలేదేమో ననుకుంటున్నాను.

జానకిని నేను గుర్తించలేదు. అందుచేత పలకరించాలనికూడా అనిపించలేదు. ఆమె నాకేసి తేరిపారజూసేసరికి అపోహకూడాపడ్డాను.

ఆమే నన్ను పలకరించింది:

"మీరు రాధకు అన్నకాదూ?"

మా పెత్తల్లి కూతురు పేరు రాధ. అదికూడా గుర్తురా లేదు.

"ఏ రాధ?" అన్నాను అయోమయంగా.

"మీ రాధ అన్నవే కదటండీ మా సావిత్రి చేసుకున్నది? మీరు పెళ్ళికి వచ్చారు కూడా కదా?"

"మిమ్మల్ని చూచినట్టు గుర్తురావటంలేదు." అన్నాను.

"చాలా ఏళ్ళయింది. పెళ్ళి పందిట్లో నన్ను చూశారో లేదో."

"మీ పేరు?"

"జానకి."

ఆ ముచ్చు ముఖం ఇట్లా తయారవుతుందంటే మా అమ్మను బతిమాలి అయినా చేసుకునే వాణ్ణి.

"మీ జ్ఞాపక శక్తి—"

నామాట పూర్తికాకుండానే, "ఆ పెళ్ళిఫొటో మా ఇంట్లో వుంది. మా నాన్న పోయాక దానికి చాలా విలువొచ్చింది. మానాన్నకు అది తప్ప మరో ఫొటో లేదు. అందుచేత దాన్ని సొరుగు లోనుంచి తీసి, ఫ్రేం కట్టించి గోడకు తగిలించి, రోజూ తుడిచేదాన్ని. తొడుతున్నప్పుడల్లా మీ వేపువాళ్ళందరినీ గుర్తుకు తెచ్చుకునేదాన్ని. అందులో వాళ్ళు ఈ నాడు ఏ దెనిమిది మంది లేరు." అన్నది.

"కొంత కాలానికి అందులో ఒక్కరుకూడా ఉండరు. అందరూ పోతూనే పోతారు." అన్నాను.

తన మనసులోని మాటే నానోట వచ్చినట్టుగా, జానకి, "అవునండీ ఒకరింట నల్లై ఏళ్ళ క్రితం నాటి పత్రిక ఒకటి ఈ మధ్య చూశాను. అందులో యాభైపైబడిన వయస్సు వాళ్ళ ఫొటో కనిపించినప్పుడల్లా వాళ్ళు చచ్చిపోయి ఉంటారుగదా అని పించి దిగులేసింది." అన్నది జానకి.

బుకింగాఫీసు దగ్గర బెల్లు మోగింది.

అప్పుడు గాని నేను జానకి వెంట్నేఉన్న ఇద్దరు ఆడవాళ్ళనూ గమనించ లేదు.

"మగవాళ్ళకన్న ఆడవాళ్ళకు దబ్బున దొరుకుతాయి. మీ టిక్కెట్టుకూడా మేమే తెస్తాం. ఇక్కడే ఉండండి." అంటూ జానకి, నేనే క్లాసుటిక్కెట్టు కొంటానో కూడా అడగకుండా నేను పర్సు పైకి తీసేలోపల బుకింగు విండో దగ్గిరికి వెళ్ళిపోయింది.

• • •

తరవాత నేనూ జానకీ దగ్గిర అయామంటే అది నా ప్రయోజకత్వంకాదు, ఇనిషియేటివ్ ఆమెదే. ఇంటర్వెల్‌లో ఆమె నాకు తనవెంట ఉన్న ఇద్దరు స్త్రీలనూ పరిచయం చేసింది. వాళ్ళు అక్కచెల్లెళ్ళు. పెద్దావిడ వితంతువు. రెండో ఆవిడకు అసలు పెళ్ళే కాలేదు. ఎం. లిట్ పాసై కాలేజీ లెక్చరరుగా పనిచేస్తున్నది. పెద్దావిడకు

# సైరంధ్రి

ఇల్లూ, దబ్బూ, ఉన్నది; పిల్లలు లేరు ముగ్గురూ కలిసి పెద్దావిడ ఇంట్లోనే ఉంటున్నారు. నాకు తెలీదుగాని, జానకి బాగా పాడుతుందిట. సంగీత పాఠాలు చెప్పి కాలక్షేపం చేస్తున్నదిట. పెద్దావిడకు సంగీతం పిచ్చి. ఆపిచ్చే జానకిని ఆవిడకు కట్టిఉంచింది.

జానకి ఒంటరిగా ఎందుకుంటున్నది?

ఆమె భర్తను వదిలేసింది.

లేదు. భర్త ఆమెను వదిలెయ్యలేదు. ఆమె తనను వదిలేటందుకు చెయ్యదగిన పనులన్నీ చేశాడు. మాటలన్నీ అన్నాడు; ఆమె తనను వదిలేశాక, లబ్బున మొత్తుకుని, తనకు ఘోరమైన అన్యాయం జరిగిందనుకున్నాడు. తెగేదాకా లాగటమంటూ ఉంటుందని అతగాడికి తెలీదు. అతని తప్పు అనలేం. భారతనారీత్వం స్పైరల్ రబ్బరులాంటిది. ఎంతలాగినా తిరిగి యథాస్థితికి వచ్చి, ఏమీ జరగనట్టుగా మసులుతుంది. దాన్ని మనవాళ్ళు ఆకాశానికెత్తారు. ఇంకా ఎత్తుతున్నారు.

మరి రెండురోజుల అనంతరం ఆదివారం నాడు జానకిని చూడబోయాను. ఆమె మాట్లాడే పద్ధతిలో ఎలాంటి మానసిక రుగ్మతలూ కనిపించలేదు. (వాటిని గమనించేజబ్బు నాకున్నది.)

మేం అండీలు మానేసి 'నువ్వు' అని ఒకరి నొకరం పిలుచుకోవటం ఎప్పుడారంభమయిందో నాకు సరిగా గుర్తులేదు. ముందు నేనే ప్రారంభించానని తెలుసు. 'అండీ'కీ "నువ్వు" మా మధ్య "నో మాన్స్ లాండ్" ఉంటుంది. అందులో ఉభయతరవాక్యాలుంటాయి. వాటిలో ఏకవచనమూ ఉండదు. బహువచనమూ ఉండదు "ఇంకాస్సేపు కూచోరాదూ? తొందర పనేమైనా ఉందా? ఇకనేం? ఉద్యోగం ఏ ఆఫీసులో? ఎంత జీతం ఇస్తారంటా?" ఇలా.

జానకి నన్ను నువ్వు అనటం చెవులకు భలే బాగుండేది.

మొదట్లో నేను జానకి స్త్రీత్వాన్ని ఏమీ పట్టించుకోలేదని చెప్పగలను. అందే, ఆమె పట్ల నా ప్రవర్తన మగమితుడితో సాగినట్టే సాగింది. సాధారణంగా నేను ఆడవాళ్ళతో స్వేచ్ఛగా మాట్లాడలేను. కారణం వాళ్ళు తాము ఆడవాళ్ళమన్న సంగతిగాని, నేను మగవాణ్ణన్న సంగతిగాని మరిచిపోలేనట్టు కనిపిస్తారు. వాళ్ళతో స్నేహమంటే సెక్స్ స్నేహమే. మరో స్నేహం సాధ్యంకాదు.

జానకిలో అంత ఆకర్షణ ఉన్నా, ఆమెతో స్నేహంగా మాట్లాడటానికి వీలయిందంటే అందుకు నేనెంత బాధ్యుణ్ణో, ఆమెకూడా అంతే బాధ్యురాలు. మగవాళ్ళతో స్నేహం ఏర్పడినప్పుడు మనం అవతలివాళ్ళ జీవితావసరాలు ఇన్వెంటరీ తీసుకోం. వాళ్ళకి వాళ్ళే మనతో చెప్పుకోదగినవన్ని సంగతులన్నీ చెప్పేస్తారు. మనము అవనే చేస్తాం.

మాటలసందర్భంలో నా విషయాలు నేనే చెప్పాను. జానకి వాటిని ఆసక్తిగానే విన్నదిగాని, బోరైనట్టు కనిపించలేదు. అంతకన్నకూడా నాకు ఆమెలో నచ్చినదేమంటే నా నోటవచ్చిన మాటల్లో కపటంగాని, అసత్యంగాని ఉన్నదేమో నన్నట్టు ఆమె ఒక్కసారికూడా ప్రవర్తించలేదు.

నేను హోటలుతిండి మెతుకులు తినేవాణ్ణి గనక నన్ను వరసగా రెండుమూడు ఆదివారాలు భోజనానికి పిలిచింది. నేను ఏదన్నా చాలునంటే బలవంతం చెయ్యటంగాని, వద్దన్నది వడ్డించటంగాని చెయ్యలేదు. ఇది నా ప్రాణానికి చాలా మంచిలక్షణం; నామాటలో ఆమెకు సంపూర్ణ విశ్వాసం ఉందనటానికి పెద్ద తార్కాణం.

జానకి తనకు సంబంధించిన విషయాలు— ముఖ్యంగా తన వైవాహిక జీవితం గురించి ఒక్కసారిగాని, ఒక్కక్రమంతోగాని చెప్పలేదు. కాని ఆవిషయాలన్నీ నా బుర్రలో ఒక క్రమంలోనే చోటు చేసుకున్నాయి.

జానకికి పదిహేనో ఏట పెళ్ళి అయింది. అప్పటికే ఆమె తండ్రిపోయి ఏడాది దాటింది. ఆమె పెళ్ళిగురించి తండ్రి ఏవో కలలుకన్నాడు. కాని ఆయన పోయాక జానకి పెళ్ళి ఆమె తల్లికి దుస్తర సమస్య అయింది. సంబంధాలు ఎవరు చూస్తారు? ఏ సంబంధం మంచిదో, ఏదికాదో నిర్ణయించుకునే శక్తి కూడా ఆమె తల్లికిలేకపోయింది.


కొద్దిమంది "దయాదాక్షిణ్యాలు" ప్రకటించి సహాయం చెయ్యటానికి ముందుకు వచ్చారు. అయితే వారిలో అనాథరక్షణచేసే వైఖరి కనబడి జానకికి చాలా చిరాకు కలిగింది. బిచ్చగాడి మొఖానికి అయిదు పైసలు చాలవా అన్నట్టుగా వాళ్ళు, విద్వత్త లేని తమ దగ్గర బంధువుల సంబంధాలనూ, వయసు మళ్ళిన వాళ్ళనూ తెచ్చారు. జానకి వాటిని నిరాకరించినప్పుడు వాళ్ళకు చాలా కోపం వచ్చి సహాయ నిరాకరణం కూడా చేశారు.

"అబ్బో, మీకు నచ్చేవాళ్ళను మేమెక్కడ తీసుకురాగలం, తల్లీ?" అన్నదొక బంధువురాలు జానకి తల్లితో, తాను తెచ్చిన వెకిలి మొహాన్ని జానకి వద్దన్నదని కోపం.

జానకికి తమ్ముళ్ళు, ఒక్కచెల్లెలూ ఉన్నారుగాని అన్నలు లేరు.

చిట్టచివరకు సంబంధం తెచ్చినవాడు వాళ్ళకేమీ కాడు. జానకి తండ్రికి స్నేహితుడట.

జానకి తిరుమలరావును చూసి, ఇష్టపడే చేసుకున్నది. అయితే ఆమె చూసింది తిరుమలరావు ముఖం మాత్రమే. ఆమె నిజంగా ఇష్టపడింది అతని తండ్రి సంభాషణ విని.



తిరుమలరావు తండ్రి పెద్ద రేషనలిస్టు. పనికిమాలిన పాత ఆచారంమీద తిరగబడినవాడు. కొడుక్కి ఉపనయనం చెయ్యలేదు. వరకట్నాలు ఒప్పేవాడు కాదు.

"అమ్మా, మీరు చాదస్తానికి పోకుండా ఉంటే నేనొకటి చెబుతాను. మంత్రాలూ తంత్రాలూ మానేసి, నలుగురు పెద్దల సమక్షంలో వాళ్ళచేత దండలు వేయించాం," అన్నాడాయన జానకి తల్లితో.

ఆవిడ నిర్ఘాంతపోయి. "వద్దులెండి, అన్నగారూ. ఏకరాత్రం శాస్త్రోక్తంగాన జరిపిస్తాం. ఎంత ఖర్చవుతుంది?" అన్నది.

ఆతరవాత ఆవిడ ఇరుగుపొరుగు వాళ్ళతో, "కథలో రాజకుమార్తెల్లాగా పూలదండలు వేసుకునే పెళ్ళేమిటమ్మా? తరవాత దాని మొగుడు దాన్ని వదిలేసి, తనకు పెళ్ళేకాలేదంటే ఆ దిక్కుమాలిన పూలదండలు వచ్చి సాక్ష్యం చెబుతాయా? అగ్నిసాక్షిగా జరిగితేనే పెళ్ళి," అన్నది. మొత్తంమీద ఆవిడ తన కాబోయే వియ్యంకుడి సలహా విని గోతులో పడనందుకు తనను తాను చాలా అభినందించుకున్నట్టే కనబడుతుంది.

జానకి పెళ్ళి సక్రమంగానే జరిగిపోయింది. తిరుమలరావు ఒక బాలకవి అని తెలిసి జానకి కొంచెం గర్వపడింది కూడాను. అతను బియ్యే పాసయినవాడు. పెద్ద ఉద్యోగం దొరికే అవకాశం లేదు. చిన్న ఉద్యోగాలు చెయ్యటం అతనికిష్టంలేదు. అయినా ఇంటిపట్టున కూర్చుంటే జరుగుబాటు అయేపాటి ఆస్తి ఉన్నది.

కాని తిరుమలరావుకు ఇంటిపట్టున ఉండటం ఇష్టంలేదు. అతనిదృష్టి మద్రాసుమీద ఉన్నది. అందుకు జానకి గ్రహించిన కారణం అతనికి పట్నం జీవితంమీద మోజు అన్నది మాత్రమే. అదిగాక ఇంకా రెండు ప్రబలమైన కారణాలున్నాయని ఆమె కొంతకాలానికి గ్రహించింది. ("అతను పెద్ద కూబి, మనసులో ఏముందో తవ్వినా తెలిసేదికాదు. నోటంట వచ్చిన మాట నమ్మటానికుండేదికాదు." అన్నది జానకి.)

అసలు సంగతేమిటంటే, అతనికి తన తండ్రి అంటే పరమ అసహ్యం. ఆయన భావాలంటే తగని మంట.


"మా నాన్న చాదస్తంతో నాకు మూడువేలు కట్నం వచ్చేది కాస్తా పోయింది." అని అతను చాలా సార్లు జానకితో అన్నాట్ట.

కట్నం తీసుకోవడంలో గొప్ప ఏమన్నా వున్నదా?" అని జానకి అడిగిందిట.

"ఎందుకు లేదూ? ఫలాని వాడు కట్నం లేకుండా ఫలాని పిల్లను చేసుకున్నాడంటే, దాని అందంచూసి కళ్ళు బైర్లు కమ్మి చేసుకుని వుంటాడని అందరూ అనుకోరూ?"

"నాబోటి అందంలేని దాన్ని చేసుకుంటే?"

"అప్పుడు, ఏంచూసి చేసుకున్నాడ్రా అనరూ?"


Agents for Andhra Pradesh : M/s. Pragathi Agencies, Vijayawada-1



## సైరంధ్రి

తండ్రికి ఎడంగా ఉంటం కోసం. తిరుమలరావు పట్నం చేరటంలో మరో ఉద్దేశం సినిమా కవి కావటం. దాన్ని అతను చాలా కాలం జానకికి తెలియనివ్వలేదు. ("అదేం మనిషో. ఏ పని చేసినా దొంగతనమో, రంకుతనమో అన్నట్లుగా చేసేవాడు. సినిమా పాటలు రాయటానికి సినిమా కంపెనీల చుట్టూ తిరుగుతున్నానంటే, నేనేం వద్దంటానా?" అన్నది జానకి)

జానకికి కొన్ని విచిత్రమైన భావాలున్నాయి. భర్త ఏమి చేసినా తాను విమర్శించ దలచలేదు. అందుకు ఒక కారణం. అతను తన విషయాలేమీ ఆమెకు చెప్పేవాడు కాదు. మరో కారణం. అతను చేసే పనులు అవమానకరమైనవని తనకు అనిపించినా, తాను అతనికోసం సిగ్గుపడదలచలేదు

వారిద్దరి మధ్యా ఆత్మీయత లేదు.

("అతను సినిమాలలో ఎక్స్ట్రా వేషాలు వేసినా నేను 'ఇదేం పని?' అని నా నోటిమీదుగా అని ఉండేదాన్ని కాను," అన్నది జానకి)

పట్నంలో మకాం పెట్టి అతను ఉద్యోగం కోసం ప్రయత్నం చేసినట్టు లేదు. ఎక్కడెక్కడో తిరిగివచ్చేవాడు. అప్పుడప్పుడూ అతనివెంట ఎవరో ఒకరు వచ్చేవాళ్ళు. వాళ్ళు మాట్లాడుకునే ధోరణినిబట్టి కవులేమోనని జానకి అనుకునేది. అతను అడిగినప్పుడు కాఫీలూ, సాధ్యమైతే టిఫినులూ చేసి ఇచ్చేది. వాళ్ళెవరని అడిగేది కాదు, అతను చెప్పేవాడు కాదు.

భార్య తన జీవితంలో ఏమాత్రమూ పాలు పంచుకోకపోవటం అతనికి పట్టిచ్చినట్టు లేదు. ఆమె కావాలనే తన విషయాలను ఎడంగా ఉంటున్నదా అని కూడా అతను గమనించలేదేమో అన్నది జానకి.

ఇంతమాత్రాన జానకి తన భర్తను ద్వేషించి ఉండదనుకుంటాను. ఆమెలో అతనిపైన ద్వేషాన్ని రెచ్చగొట్టినది వారిద్దరి దాంపత్య జీవితాలు అతని ప్రవర్తన...

అతను తానుకూడా ఒక సాహితీ పరుడుగానే మాట్లాడేవాడు. అందుకు జానకికి అభ్యంతరం లేదు. పాటకవులందరిలోనూ ఏదో ఒక దోషం ఎంచేవాడు. అసూయ అనుకున్నది జానకి. శ్రీశ్రీకి తనకూ మాత్రమే కవిత్వ రహస్యం అర్థమయిందని చెప్పాలన్నాడు ఒకసారి ఎవరితోనో. అహంకారం అనుకున్నది జానకి. తరవాత నన్నగన్నగా శ్రీశ్రీ కవిత్వానికి కూడా ఏవో వంకలుపెట్టి తాను ఒక్కడేనని నిర్ధారణ చెయ్యటానికి సిరికి ప్రయత్నం చేశాడు.

("విశ్వనాథవారి పద్యాలు అతనికి అర్థం కావని నేను రూఢిగా చెప్పగలను," అన్నది జానకి.)

జానకికి పుస్తకాలూ, పత్రికలూ చదవటం చాలా సరదా. లేకపోతే పాడుకునేది.

అతనికి సంగీతం ఇష్టం లేకపోయి ఉండొచ్చు. అటువంటి వాళ్ళు చాలా మంది వుంటారు. కాని అతను ఆమె పాట సహించలేడని తెలిసింది.

ఒకటి రెండు సార్లు ఆమెను "నీకు పాడటం ఇప్పుడే ఉండేః" అని అడిగాడు.

ఇంకో సారి తాను ఇంటికి వచ్చేసరికి ఆమె పాడుకుంటున్నది. తనను చూడగానే ఆమె పాట ఆపనందుకు అతనికి ఆశ్చర్యమూ, కోపమూ కూడా వచ్చాయిట.



"నేను లేకుండా చూసి పాడుకుందూ, నీకు పుణ్యం ఉంటుంది" అన్నాట్ట చాలా మంచిగానూ, మృదువుగానూ చెప్పుకుంటున్నాననుకున్నట్టుగా.

మరోకసారి. "నువు పాడేది బూతుపాటల్లే వుందేః" అని ఆక్రోశంగా అడిగాట్ట.

"అవును. జావళీలు కొంచెం శృంగారంగానే వుంటాయి." అన్నదిట.

"ఉన్నవనే దగ్గు. శృంగారమే బూతు ఇదేనా ఏమిటి నీకు మీనాన్న సంగీతం మేష్టర్ని పెట్టి చెప్పించినదిః" అని అడిగాట్ట.

తాను వున్నప్పుడు పాడకూడదు తాను లేనప్పుడు పాడితే, "ఎవరిని ఆకర్షించటానికి పాడుతున్నావుః" అని అడిగేవాట్ట.

"నా గొంతు వింటే శాంతి వస్తుందని చెప్పేనటున్నారుః" అని అన్నదట జానకి.

"తాళి గట్టిన పాపంచేత నాకు అసహ్యమైతే పరాయివాడికి అసహ్యం ఎందుకనుకో వాలిః పరాయివాడి పెళ్ళాం ఎప్పుడూ రంభేః" అన్నాట్ట!

"అది మీ అనుభవం గామాలుః" అన్నదిట జానకి.

తిరుమలరావు నిప్పులు తొక్కిన కోతిలాగా గంతు వేశాట్ట.

ఇంటికి ఏ పత్రికలూ రానిచ్చేవాడు కాడు. పత్రికలనిండా బూతు కథలే ఉంటాయనేవాట. చలం పేరు వినితే వెర్రెత్తినట్టు అయిపోయేవాట్ట.

"నేను చలంగారి నవలలూ, కథలూ చాలా చదివాను," అన్నదిట జానకి, కేవలమూ అతన్ని రెచ్చగొట్టటానికే.

అతను కళ్ళు పెద్దవిచేసి, "అవి చదివి చెడిపోకుండా ఉన్నావంటే నేను నమ్మను," అన్నాట్ట.


సెక్సు విషయంలో అతను ఉత్త పశువన్నది జానకి. ఆమె నాదగ్గర ఏదీ దాచలేదు. ఆమె కూడ ఒకవంక అలుగుతూనే సెక్సుకు సిద్ధపడేవాట్ట— పగ సాధించుకోవటానికన్నట్టే:

ఒకసారి ఆమెకు జ్వరం తగులుతూంటే, తెలిసికూడా అతను కామం తీర్చుకున్నాట్ట.

"అతనిమీద నాకు కలిగిన దురభిప్రాయం మాటకేంగాని, నన్ను చూస్తే నాకు చాలా అసహ్యం పుట్టేట్టు చేశాడు. అతనికన్నకూడా భార్యలను హింసపెట్టే భర్తలు యీ లోకంలో ఉన్నారేమో— ఉండే ఉంటారు. అది భరించేవాళ్ళ మాట నే నెరగను. వాళ్ళకు ఆత్మాభిమానం లేదేమో. నేనుమాత్రం ఆత్మాభిమానంతో చచ్చిపోయాను. ఎదురు తిరిగి పోట్లాడితే కొంత ఉపశాంతి కలిగేదేమో. కాని అంతా నేర్చుకున్నాను. చివరకు నా అంత రోతముండ ప్రపంచంలో ఉండదనిపించింది. నాలో ఏమాత్రం అభిమానం ఉన్నా ఈ మాదిరి మొగుడిదగ్గర ఒక్కక్షణం ఉండననిపించింది. అతను పెట్టే తిండిమెతుకులకుగాను ఇదంతా భరిస్తున్నాననిపించింది.

"నాలుగేళ్ళు భరించాను. ఇంక చాలుననిపించింది. ఒకరోజు చెప్పేశాను. 'నన్ను మీరు మెదడులేని ఆడదాననుకుంటున్నారో, ఊరందరితోనూ రంకుపోగల సాహసురాలిననుకుంటున్నారో నాకు తెలీటంలేదు. నేను చిన్నతనంలో కుర్రాళ్ళతో మొగుడూ పెళ్ళాం ఆటలు ఆడినదాన్నేః" అన్నాను.

"ఆ మనిషి మొహం చూసితీరాలి. ఎవ



రితో?" అని అడిగాడు. "ఎవరైతేనేం? పాపం, చిన్నతనంలోనే మశూచికంవచ్చి పోయాడు" అన్నాను. పళ్ళు బిగబట్టి, "నువ్వు పోయినా పీడ విరగడై ఉండేది." అన్నాడు కొంచెం ఆలోచించి, "వెధవముండను పెళ్ళాడానన్న మాట! ఇదంతా నాకు చెప్పటానికి సిగ్గులేదూ" అని అడిగాడు. లేదన్నాను. "పో నా ఎదటి నుంచి! నిన్ను గొంతుపిసికి చంపెయ్యగలను," అన్నాడు.

"నేను వెంటనే వెళ్ళి పెట్టె సర్దసాగాను. తాను మాట్లాడలేదు. పెట్టెతీసుకుని బయలుదేరుతుంటే, ఎక్కడికన్నాడు. "ఎక్కడికైతేనేం? మీవంటి నీతివరుడికి నేను నిజంగా తగను." అన్నాను. "నిన్ను నేను ఇల్లువదలి పొమ్మన లేదు." అన్నాడు. పిరికిపంద అనుకుంటాను లేకపోతే నేను చేసే ఇంటిచాకిరీ చెయ్యటానికి మరెవరూ దొరకరనే అనుకున్నాడో.

"మీరు పొమ్మంటేనే నేను పోవాలాఏమిటి? మీ మొహం చూడటానికి నాకూ అసహ్యంగా ఉండొచ్చుగా?" అని బయలుదేరి తిన్నగా రైలు స్టేషనుకు వెళ్ళాను." అన్నది జానకి.

ఆమె పుట్టింటివద్ద రెండునెలలేమో ఉన్నట్టున్నది.

"నేను చాలా అదృష్టవంతురాలిని. సాధారణంగా ఇట్లా మొగుణ్ణి వదిలేసి వచ్చిన ఆడదాన్ని పుట్టింటివాళ్ళు కుక్కకన్న హీనంగా చూస్తారుట. నన్ను మా అమ్మగాని, తమ్ముళ్ళుగాని హీనంగా చూడలేదు. ఊళ్ళోవాళ్ళే చాటుగా రకరకాలుగా చెప్పుకున్నారని తెలిసింది. వాళ్ళూ సమాజం!

"అయితే నాకు అక్కడ ఉండబుద్ధి కాలేదు. మావూరి మునసబుకొడుకొకడు నామీద కన్నేసి ఉంచాడు. మా ఇంటిముందుగా తెగ తారట్లాడేవాడు. ఒకసారి నామీదికి చిన్నకాగితం ఉండ విసిరేశాడు. తాను సినిమాల్లో నటించటానికి పట్నం పోతున్నాట్ట. నేను కూడావస్తే నన్ను కూడా సినిమాల్లో చేరుస్తానన్నాడు.

"ఇటువంటి మోసగాళ్ళను గురించి చాలా కథలు చదివాను. అయినా నాకు భయం కలుగలేదు. అన్ని సంకెళ్ళనూ తెంపేస్తే కొంత స్వేచ్ఛ లభిస్తుంది. ఆ తరవాత చావును మించిన పెద్ద ప్రమాదం ఏదీ జరగదు. ఎందుకు భయపడాలో నాకు అర్థంకాలేదు.

"అతనితో ఆ రాత్రి బయలుదేరి వచ్చేశాను.



అతను కథలో ఉండేటంత దుర్మార్గుడు కాడు. నాకు సినిమా ఛాన్సులు అవసరంలేదనీ, నేను అతన్ని మోహించి వెంటరావటంలేదనీ రైల్లోనే చెప్పేశాను. అతను నన్ను చాలా మర్యాదగా చూశాడు. నేనంటే కాస్త భయపడ్డాడుకూడా. మగవాడు తనని చూసి భయపడుతున్నాడంటే ఆడదానికెంత గర్వం పోసుందో తెలుసా? జీవితంగురించి అతనికున్న భ్రమలేవీ నాకు లేవు. సగం అందుకే అతనికి నేనంటే భయమేమో.

మేం కొంతకాలం ఈ పట్నంలో భార్యాభర్తలలేగ జీవించాం. అతనికి సినిమా ఛాన్సు రాలేదుగాని నాకు రేడియోలో పాడే ఛాన్సులు వచ్చాయి రేడియోలో అతనికిద్దరు స్నేహితులుండేవారు. వాళ్ళు నా పాట విని ఆడిషన్ ఇప్పించారు.

రేడియోలో నేను పాడిన లలిత పాటలు విని ఒకమ్యూజిక్ డైరెక్టరుగారు నన్ను సినిమా కోరస్‌లలో పెడతానన్నాడు. నేను అవసరం లేదన్నాను. రేడియోలో కూడా నన్ను పాటకచేరీలు చెయ్యనివ్వలేదు. నా అదృష్టం కొద్దీ ట్యూషన్లు దొరికాయి. మావూరి మునసబుగారి




కొడుకు తెచ్చుకున్న డబ్బంతా తగలేసి వెళ్ళిపోయాడు. నన్ను విడిచి వెళ్ళిపోవటం కష్టంగా ఉందన్నాడు. "నాకూ కష్టంగానే ఉంది. అయినా నీబతుకు నువ్వు బతకాలి, నాబతుకు నేనుబతకాలి. మనిద్దరిదారి ఒకటికాదు! అన్నాను.

"అతను వెళ్ళిపోయేనాటికి నాకు నెలతప్పింది. ఆ సంగతి అతనికి చెప్పలేదు. తరవాత ఒక డాక్టరుగారి సహాయంతో అదికాస్తా రెండోనెల్లోనే వదిలించుకున్నాను," అన్నది జానకి.

. . .

ఆమె జీవితాన్నిగురించి చాలా ఆలోచించాను. ఆడదానికి ప్రకృతి అన్యాయం చేసిందంటారు. అన్నిటికన్నా ఆడదానికి హెచ్చు అన్యాయం చేసినది వివాహవ్యవస్థ. వివాహ వ్యవస్థే లేకపోతే ఆడదాన్ని బతుకంతా లేత అరిటాకులాగా తయారుకాదు. వివాహ వ్యవస్థ ననుసరించి వచ్చిన సామాజిక పరిణామాలన్ని ఆడదానికి స్వేచ్ఛ లేకుండానే చేశాయి.

జానకి లాగా నిజం చెప్పెయ్యటం తన స్వేచ్ఛకు ప్రధానంగా అనుకునే మనిషి శరీరం అమ్ముకుని బతకను కూడా లేదు. ఆమె సంగీత




పాఠాలు చెప్పుకుని ఎంతకాలం బ్రతుకుతుంది? న్యూగలు పైసలతో చదువుచాలించినమనిషికి ఏం ఉద్యోగాలు దొరుకుతాయి? అక్కడా సెక్సువెంటాడుతుంది. దాన్నుంచితప్పించుకోవటం కష్టం.

ఈ మాటే నేనంటే, "మెల్లగా అంటున్నావా? నేను ఎప్పుడు బస్సెక్కినా నాకు ఓ అరవై యేళ్ళ మగాడి శరీరం తగిలితే చాలు ఒళ్ళంతా ఝులు మంటుంది. ఈ సెక్సు లేకుండా చేసుకునేటందుకే కాబోలు మనవాళ్ళు బ్రహ్మచర్యం కావాలనుకునే వాళ్ళు అన్నది జానకి

నాకు జానకి లాంటి మనిషి కావాలని తెల్సుకున్నాక, ఆమెను నేనెందుకు పెళ్ళి చేసుకోలేదో చెప్పాను: ఒక్కముక్కలో.

"మనిషిని ప్రేమించి పెళ్ళిచేసుకునే అవకాశం నాకు కనుచూపుమేరలో ఎక్కడా కనిపించక నేను పెళ్ళిచేసుకోలేదు." అన్నాను.

"అసలే గొడవగాఉంటే ఇందులోకి ప్రేమ ఒకటి తెచ్చిపెట్టావా?" అన్నది.

"నువు స్వేచ్ఛ అనేదానికి, నేను ప్రేమ అనేదానికి చాలాదగ్గర సంబంధం ఉన్నది. నాకు యుక్తవయసువచ్చాక ఒకరు నాతోగాని, నేను ఒకరితోగాని స్వేచ్ఛగా మాట్లాడలేదు. అది ఒక అవసరంకాదా? నిజంగా స్వేచ్ఛగా మాట్లాడాలంటే ఒకమనిషి దొరికినాక మరొక మనిషికి ఆస్థానం ఇవ్వగలమా? ఏదీ దాచుకోవటం దాతగాని మూడుమాటలు చెప్పటంలేదు. నువు నాతో చెప్పినసంగతులన్నీ ఇంకెంతమందితో చెప్పి ఉంటావు?" అని అడిగాను.

జానకి ఆశ్చర్యంగా మొహంపెట్టి, "ఎవరికీ చెప్పలేదు," అని వెంటనే నవ్వి, "నేను నిన్ను ప్రేమిస్తున్నా నంటావేమిటి?" అన్నది.

"నాకావిషయం అనుమానం కూడా లేదు." అన్నాను. "మరి నువ్వు?"

"అదే చెబుతున్నాను. నేను ఆడవాళ్ళతో స్నేహం అన్నది ఎన్నడూ చెయ్యలేదు. నీతో చేశాను. నిన్నువదిలేసి నేను మరొకతెను పెళ్ళిచేసుకుని ఏం సుఖపడతాను? మనిద్దరమూ దీన్ని యావజ్జీవ స్నేహం చేసుకుందాం? పెళ్ళి ఎటాగూ సాధ్యంకాదు. నీ లీగల్ మొగుడు బతికున్నాడు. నీకు పిల్లలు పుట్టినా భయపడ నవసరంలేదు. నాకు బ్యాంకు వాళ్ళిచ్చే జీతండబ్బులు ఒకకుటుంబాన్ని పోషించటానికి సరిపోతాయి. నీకు శైధిల్యలో ఉన్నభావం ఏనాడూ రానివ్వను," అన్నాను.

జానకి నాచేతిలో చెయ్యివేసింది. ●